# సతీవ్రతులు

**సతీవ్రతులా ! - అంటే ఏమిటి? 'భర్తను దైవంగా పూజించే శీలవతి అయిన స్త్రీని పతివ్రత అంటారు గదా ! అలాగే భార్యను తప్ప పరాయి స్త్రీని ఎరుగని శీలవంతుడైన భర్తని సతీవ్రతుడు అనాలి కదా ! ఈ పదాన్ని చరిత్రలో దాచిపెట్టి ఇన్నాళ్ళూ స్త్రీ జాతికి అన్యాయం చేశారు. నేటి పురుషాధిక్య సమాజానికి ఈ పదం ఎంతో అవసరం' - అరుణరేఖ ఎత్తిన ధ్వజం ఇలా ఎందుకు రెప రెప లాడింది?**

## ఇంద్రకంటి లక్ష్మీనారాయణ

సాయంత్రం అయిదు గంట లయ్యింది.

తీరుబడిగా వాలుకుర్చీలో కూర్చుని వారపత్రిక చదువుతున్న అరుణరేఖగేటు తెరిచిన శబ్దమైతే 'ఎవరా' అని తొంగి చూసింది.

శైలజ ''హాయ్ అరుణరేఖా ! తీరికగా ఉన్నట్టున్నావ్. తొందరగా బయలుదేరు. బజారు వెళ్ళొద్దాం. పది నిముషాల్లో రెడీ అవ్వాలి. లే. లే.''

''ఏమిటీ. ఇలా వచ్చావే, లేదో తుపానులా హోరెత్తించేస్తున్నావ్ ! ఏమిటి కథ?''

''కథా !, కాకరకాయాకి ఏమీ లేదు. మా వారికి బోనసు ఇచ్చారట. 'వచ్చే నెలలో పెళ్ళి రోజు కదా. నీకు నచ్చిన చీర కొనుక్కో' అని ఓ మూడొందలు నా మొహాన పారేశారు. 'ఇద్దరం కలసి వెడదాం రండీ' అంటే 'తలనొప్పిగా ఉంది. నువ్వు, మీ స్నేహితురాలు కలిసి వెళ్ళండి' అని చెప్పి తప్పించుకున్నారు. ఆలస్యం చేస్తే ఆయన వైఖరి ఎక్కడ మారిపోతుందోనని వెంటనే బయలుదేరాను. అదీ సంగతి. నువ్వు కూడా వస్తే సరదాగా ఓ గంటలో తిరిగొచ్చేద్దాం. సరేనా?''

''అది కాదే. ఆయన ఆఫీసునుం చొచ్చే వేళవుతోంది కదా, ఇప్పుడెందుకు? రేప్పొద్దున వెడదాంలే.'' తప్పించుకోవాలని చూసింది అరుణరేఖ. ఆమె భర్త మురళీధర్ నిజానికి ఏ రోజూ ఎనిమిది గంటలలోగా ఇంటికి చేరడు.

''అదేం కుదరదు. మీ ఆయన ఆఫీసు నుంచి ఎన్ని గంటల కొస్తారో నాకు తెలునుగాని, నువ్వు త్వరగా తయారవ్వు.''

తప్పలేదు అరుణరేఖకి. వెళ్ళాలని లేకపోయినా తప్పనిసరై బయలుదేరింది.

ఆటో ఎక్కా రిద్దరూ. పది నిముషాల్లో జగదాంబ సెంటర్‌కి చేరుకుంది ఆటో. రంగు రంగుల దీపాలంకరణలతో దేదీవ్యమానంగా వెలిగిపోతోంది ఆ బట్టల షాపు. అరగంట పట్టింది శైలజకు నచ్చిన చీర దొరికేసరికి. జాకెట్టు ముక్క కోసం మరొక పావుగంట. బిల్లు చెల్లించి బయటకొచ్చేసరికి చిరాకుగా అనిపించింది అరుణరేఖకి.

ఆటో కోసం చూస్తూ పేవ్‌మెంట్ మీద నిలబడ్డా రిద్దరూ.

''ఏయ్ అటు చూడు.'' పరధ్యానంగా నిలుచున్న అరుణరేఖను మో చేత్తో పొడుస్తూ చూపించింది శైలజ. ''మీ ఆయన కాదూ?'' ఉలిక్కిపడి చూసింది అరుణరేఖ.

ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర ఎర్రలైటు వెలుగు తుండడంతో ట్రాఫిక్ అంతా నిలిచిపోయింది. చిట్టచివరగా ఉన్న స్కూటర్. పరీక్షగా చూసింది.

సందేహం లేదు ఆయనే. వెనకసీట్లో ఎవరో పంజాబీ డ్రెస అమ్మాయి కూర్చునుంది. ఆ అమ్మాయి అతని భుజం మీదుగా ముందుకు వంగి ఏదో చెవుతూంటే మురళీధర్ నవ్వుతూ వింటున్నాడు.

ఇంతలో పచ్చలైటు వెలగడంతో ముందుకు కదిలింది. మురళీధర్ స్కూటర్‌ని తిన్నగా జగదాంబ థియేటర్ ఆవరణలోనికి పోనిచ్చాడు. టిక్కెట్లు తీనుకొని వాళ్ళిద్దరూ చెట్టాపట్టా లేనుకుని థియేటర్లోకి వెళ్ళడం చూసింది అరుణరేఖ. ఆమె మనస్సంతా చేదుగా అయిపోయింది.

''చూశావా మీ ఆయన? నేను ముందు చెబితే విన్నావా? మా ఆయన శ్రీరామ చంద్రు డన్నావ్ ! ఇప్పుడు చూడు. బోనసు డబ్బందుకుని 'స్టెపినీ'తో షికార్లు కొడుతున్నాడు.'' చిన్నగా గిల్లుతూ అంది శైలజ.

తల దించుకుంది అరుణరేఖ. అవమానభారంతో ఆమె హృదయం దహించుకుపోసాగింది.

''తప్పు చేస్తున్న మహానుభావుడు హాయిగా కాల రెగరేస్కుకు తిరుగుతూంటే, నువ్వెందుకే తప్పు చేసినదానా తల దించుకుంటావు? సిగ్గు పడాల్సింది అతను ! అయినా ఈ మగ వాళ్ళందరూ అంతే ! ఇంట్లో మహాలక్ష్మిలాంటి ఇల్లాలున్నా వీధిలో కాస్త కక్కుర్తిపడందే తోచదు వాళ్ళకి. అదే మరి మగబుద్ధి అంటే ! ''అక్కసుగా అంది శైలజ.

అటుగా వస్తున్న ఆటోను ఆపి యాంత్రికంగా ఎక్కి కూర్చుంది అరుణరేఖ. శైలజ అనుసరించింది.

ఆటోలో కూర్చున్నంత సేపూ, ఏదో చెప్తూనే ఉంది శైలజ. పరధ్యానంగా 'ఊకొడుతూ కూర్చుంది అరుణరేఖ.

ఆమె గుండెలో అగ్ని పర్వతాలు బ్రద్ధలవుతున్నాయ్. ఆలోచనలు లావాలా ఆమె అంతరంగాన్ని కమ్ముకుంటున్నాయ్. వంచితురాలి నయ్యాననన్న వేదనే, తనవా డనుకున్న భర్త తనకు కాకుండా పోతున్నాడనే దిగులూ అణువణువునా ఆమెను ఆక్రమించుకుంది.

ఆటో ఇంటిముం దాగింది. నెమ్మదిగా దిగా రిద్దరూ. వెళ్ళేటప్పుడున్న ఉత్సాహం మచ్చుకైనా లే దిప్పుడు.

''తేలికగా తీసుకో, అరుణా ! ఆ విషయం గురించి ఎక్కువగా ఆలోచించకు. బ్రతుకంతా అడుగడుగునా రాజీపడటం ఆడదానికి అనాది నుంచీ వస్తున్న శావం. బాధపడకు.'' ఆమె చేతిలో చెయ్యివేసి నొక్కుతూ నెమ్మదిగా అంది శైలజ.

''అలాగేలే.'' యాంత్రికంగా గేటు తెరుచుకుని లోపలి కెళ్ళింది అరుణరేఖ. నిలుచునే ఓపిక లేనట్లు మంచం మీద వాలిపోయింది.

అనుక్షణం అనుమానంతో తనను వేధించే భర్త అనలు స్వరూపం ఇదా ? అతను చెప్పే నీతులన్నీ నాకు మాత్రమే పరిమితమా ? అతనికి ఏ నీతులూ, నియమాలూ అవసరం లేదా ? తన చిన్ననాటి నేస్తం... ఒక్కగా నొక్క ప్రాణ స్నేహితుడు నరేంద్ర... అపురూపంగా తనను చూడాలని ఇంటికొస్తే 'అతను నీ మాజీ ప్రియుడా'. అంటూ మాటల తూటాలతో గుండెల్ని తూట్లు పొడిచిన





భర్త ఎవరో అమ్మాయిని వెంటేసుకుని ఎంత నిర్భయంగా తిరుగుతున్నాడు! ' మీ ఆయన ఎవతెనో వెంట బెట్టుకుని రోజూ హొటళ్ళకీ, షికార్లకీ తిరుగుతున్నారటమ్మా. అందుకే ఆఫీసునించి రావడం ఆలస్యం; పని మనిషి ఏదో చెప్పబోతే నమ్మలేదు. శైలజ చెప్పినా పట్టించుకోలేదు. 'ఆఫీసులో పని ఎక్కువ. బాధ్యతంతా నాదే. అందుకే ఆలస్య మవుతోంది' అని ఆయనంటే ఎంత అమాయకంగా నమ్మింది తను.

ఆలోచనలు తేనెటీగల్లా ముసురుకుని ఆమె మెదడును తొలిచేస్తున్నాయ్.

ఈ మగజాతికి ఎంత స్వార్థం! పరాయి వాణ్ణి పన్నెత్తి పలకరిస్తేనే పాతివ్రత్యం చెడిపోతుందని బాధపడే వాళ్ళు, ఎంత మంది ఆడవాళ్ళతో తిరిగినా తప్పు లేదా? చిన్ననాటి స్నేహితుణ్ణి 'మాజీ ప్రియుడు'గా అభివర్ణించే వీళ్ళకి ఎంత మంది ప్రియురాళ్ళున్నా తప్పు కాదు. తన భార్య మాత్రం ప తివ్రత కావాలి. కార్యేషు దాసీ, కరణేషు మంత్రీ అంటూ వాళ్ళ అడుగులకు మడుగు లొత్తాలి. భార్య కూడా ఓ మనిషేననీ, ఆమెకూ మనసుంటుందనీ, ఇష్టాయిష్టాలుంటాయనీ గ్రహించకుండా దొడ్లో పశువుని కట్టుకున్నట్టు ఇంట్లో భార్యను బంధించి ఇంత తిండి పెట్టడమేనా దాంపత్యానికి అర్థం? ఏ పురాణాలు విన్నా ఏ కథలో చూసినా, ఎవరి నోట విన్నా ఎప్పుడూ ఆడదాని శీలం గురించే చర్చిస్తారు కాని, మగవాడి శీలం గురించి ఎవ్వరూ మాట్లాడరేం. మగవాడికి శీలం అక్కర్లేదా? పవిత్రమైన భార్య కావాలనుకునే మగవాడు తా ను పవిత్రంగా ఉండ నవసరం లేదా? పెళ్ళికి ముందు ఎంత మంది అమ్మాయిలతో తిరిగిన వాడికైనా, పెళ్ళి దగ్గరి కొచ్చే సరికి మాత్రం అచ్చమైన కన్య కావాలి. పెళ్ళయ్యాక కూడా ఎంత మందితో తిరిగినా పెళ్ళాం మాత్రం పతివ్రత కావాలి. ఛ! ఏం మనుషులు!

ఒక్కసారి సమాజం మీద కసి పెరిగిం దామెకు. మగ జాతి స్వార్థం తలచుకుంటే అసహ్యకరమైన ద్వేషభావం కలిగింది. తన భార్యకు వేరే మగవాడితో సంబంధం ఉందని తెలిస్తే ఏ భర్తయినా తన భార్య నేలుకుంటాడా? సరికి అవతల పా రెయ్యడూ? అదే పని భర్త చేస్తే మాత్రం 'మగవాళ్ళు కదా' అని సరిపెట్టుకోవాలా? ఇ దెక్కడి న్యాయం?

పె ళ్ళయిన మగాడితో విచ్చల విడిగా తిరగడానికి ఆ అమ్మాయి కయినా సి గ్గుండద్దూ? అయినా వాళ్ళ ననుకునేం లాభం మన బంగారం మంచిది కానప్పుడు?

ఇప్పుడేం చేయాలి? తీవ్రంగా ఆలోచించసాగిం దామె. రాజీపడే ప్రసక్తి లేదు. అనుమానంతో, సూటిపోటి మాటలతో అనుక్షణం తనను బాధపెడుతూ తను మాత్రం హాయిగా గడపా లనుకుంటున్న భర్తకు తగిన బుద్ధి చెప్పాలి! పాతుకు పోయిన పురుషాహంకారానికి గుణపాఠం నేర్పాలి. ఓ స్థిరమైన నిర్ణయాని కొచ్చిం దామె.

తొమ్మిది కావస్తోంది టైము. లేచి స్నానాల గదిలో కెళ్ళి చల్లని నీళ్ళతో మొహం కడుక్కుని వచ్చే సరికి మనసు తేలికపడినట్టు హాయిగా అనిపించిం దామెకు. నిదానంగా వంట చెయ్యడం మొదలు పెట్టింది.

వంట చేస్తుండగా వచ్చాడు మురళీధర్. ఏడ్చి ఏడ్చి అలసినట్టు ఎర్రని కళ్ళతో ముభావంగా ఉన్న అరుణ రేఖను చూడగానే వెంటనే అడిగాడు.

"ఏమైం దరుణా? ఏమి టలా ఉన్నావ్? ఏం జరిగింది?"

అతని మాటలు విననట్లుగా మౌనంగా తన పని చేసుకో సాగింది.

"అడుగుతూంటే మాట్లాడవేం? ఏమయ్యిం దివ్వాళ నీకు? ఇప్పుడు వంట చేస్తున్నావేం?" రెట్టించాడు.

"ఊరు మీద షికార్లు కొడుతున్నాను. అందుకే వంట లే టయ్యింది." విసురుగా సమాధాన మిచ్చిం దామె.

ఆమె అంత నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడం పె ళ్ళయిన ఈ మూ డేళ్ళలోనూ ఎప్పుడూ చూడని మురళీధర్‌కి ఆశ్చర్యంతో పాటు కోపమూ వచ్చింది.

ఏదో అనబోయేంతలో ఆమే అంది - "అవునూ... ఆఫీసు నాలుగున్నరకే అయిపోయింది కదా, మీ రిప్పటిదాకా ఎక్కడ కెళ్ళారు?

తీవ్రమైన ఆమె కంఠస్వరం విని గతుక్కుమన్నాడు మురళీధర్. ప్రతి రోజూ ఆలస్యంగా ఎనిమిది దాటాక ఇల్లు చేరడం అలవాటే అతనికి. ఇంతకు ముం దెప్పుడూ అరుణరేఖ అలా ప్రశ్నించ లేదు.

"ఏం! నీకు చెప్పాలా?"

"చెప్పి తీరాలి!"

"నీకు చెప్పాల్సిన అవసరం నాకు లేదు." గొంతు పెంచి కోపంగా సమాధాన మిచ్చా డతను.

అతని కోపం ఆమె భయపెట్టలేక పోయింది. "తెలుసుకోవలసిన అవసరం నాకుంది. ఎందుకంటే.. నేను మీ భార్యను కాబట్టి."

"ఓహో! భార్యవని గుర్తుంది కదా? అలాగే ఉండు. అధికారం చెలాయించాలని చూడకు. అయినా ఏ రోజూ లేనిది ఇవ్వాళ ప్రత్యేకంగా అడగాల్సిన అవసరం ఏం వచ్చింది?"


"ఇంతవరకూ తమ రాసలీలల్ని గురించి వినడమే కాని కళ్ళారా చూసే మహాభాగ్యం ఈ రోజే కలిగింది కాబట్టి." వ్యంగ్యంగా అం దామె.

కంగు తిన్నాడు మురళీధర్. "ఏం చూశావు నువ్వు?"

"జగదాంబ థియేటర్‌కి తమ రో వగలాడిని వెంటేసుకుని ఇంగ్లీషు సినిమా కెళ్ళడం నా కళ్ళారా చూశాను."

అంతా తెలిసిపోయిం దన్నమాట. ఇక భయ మెందుకు? అతనిలోని మగాడు ఒళ్ళు విరుచుకు లేచాడు. పురుషాహంకారం బుసలు కొట్టింది.

"అవును వెళ్ళాను. అయితే ఏంటట? ఇంతకీ ను వ్వెడితో కలిసొచ్చావ్ ఆ థియేటర్‌కి?" చేసిన తప్పుని కప్పిపుచ్చుకోవడానికి భార్య శీలం మీద నింద వేయడానికి ఏమీ సందేహించలేదు. చాలా సులువుగా అడిగా డతను.



"ఛీ! మీరు చేసిన వెధవ పనిని సమర్థించుకోవడానికి నా గురించి వాగుతారా? సిగ్గుగా లేదూ?" అంతరాంతరాల్లో ఏ మూలో మిగిలి ఉన్న భర్త అనే గౌరవం కాస్తా పోయిం దామెకు. అతని నీచత్వానికి అసహ్యం కలిగింది.

"సమర్థించుకోవలసిన అవసరం నాకు లేదు. ఎందుకంటే మగాణ్ణి. నే నెలా తిరిగినా అడిగే హక్కు నీకు లేదు. నోర్మూనుకుని పడుండు."

అతని ధోరణికి నిలువెల్లా ఆవేశంతో కంపించి పోయిం దామె.

"మగాణ్ణనే అహంకారంతో నీ ఇష్టం వచ్చినట్టు తిరిగితే నువ్వు తిట్టినా, కొట్టినా నీ ఇంట్లో పడి ఉండడానికి నే నేమీ నీ ఇంటి పెంపుడు జంతువును కాదు. నీకు పతివ్రతలాంటి పెళ్ళాం కావాలి. నువ్వు మాత్రం ఎంతమందితో తిరిగినా పట్టించుకోకూడదు. అడగకూడదు. ఏం? నువ్వు నీ దిక్కుమాలిన అనుమానాలతో అనుక్షణం నన్ను హింసిస్తుంటే నోర్మూనుకుని భరించడానికి నేనూ రక్త మాంసాలున్న మనిషినే! నాకూ ఆవేశం, ఆలోచనలూ ఉంటాయ్. గుర్తుంచుకో!" అరిచిం దామె.

ఆమెలో తిరుగుబాటు ధోరణిని సహించలేకపోయా డతను. "ఏంటే ఇందాకట్నుంచి చూస్తున్నాను. ఊరికే తెగ ఉపన్యాసాలు దంచేస్తున్నావ్! మొగుణ్ణెదిరించే స్థాయికి ఎదిగిపోయావా? రెండు తగిల్తే కాని నీ పొగరు తగ్గదు." విచక్షణా జ్ఞానం ఎప్పుడో నశించిపోయిం దతనిలో. అవధులు దాటిన ఆవేశంతో చెయ్యెత్తా డామెను కొట్టడానికి.

ఒక్క అడుగు వెనక్కి జరిగిం దామె.

కళ్ళలో అగ్నివర్షం కురిపిస్తూ సూటిగా చూసిం దతని వైపు.

ఆమె రౌద్ర దృక్కులను తట్టుకోలేకపోయా డతను. ఆ చూపుల్లోని తీక్షతకి ఒక్క క్షణం నిశ్చేష్టు డయ్యాడు. ఎత్తిన చేయి కిందకి వాలిపోయింది.

ఆమె ముందు ఓడిపోవడం భరించలేకపోయా డతను. చివరిగా అడిగాడు. "నోర్మూనుకుని పడుంటావా! జుట్టు పట్టుకుని బయటకి ఈడ్చెయ్యమంటావా?"

"నీ కా శ్రమ అక్కర్లేదులే." లోపలి కెళ్ళి అయిదు నిముషాల్లో చేతిలో సూట్‌కేస్‌తో బయట కొచ్చిం దామె. "వెడుతున్నాను మిస్టర్ మురళీధర్! నీ ఇంట్లోంచి శాశ్వతంగా బయటికి వెడుతున్నాను. విడాకుల నోటీసు కోసం ఎదురు చూస్తుండు."

చకచక బయటికి నడిచిం దామె. పట్టుదల, ఆత్మవిశ్వాసం ఆమె ప్రతి అడుగులోనూ ప్రతిఫలిస్తున్నాయ్. ఏమాత్రం తొట్రుపాటు లేకుండా ధైర్యంగా ఆటో ఎక్కింది అరుణరేఖ.

ఆశ్చర్యంగా నోరు తెరుచుకుని చూస్తూ నిలబడిపోయిన మురళీధర్ వంట గదిలో స్టౌమీద వదిలేసిన కూర మాడిపోవడంతో ఆ ఘాటుకి ఊపిరాడక ఉక్కిరిబిక్కిరయ్యాడు.

★ ★ ★

మరుసటి రోజు ఉదయం పది గంట లవుతోంది టైము.

ఆఫీసుకి వెళ్ళడానికి హడావిడిగా తయారవుతున్న జానకిరామం చేతిలో సూట్‌కేస్‌తో ద్వారంలో నిలుచున్న అరుణరేఖను చూసి ఆశ్చర్యంతో నిలబడిపోయా డొక్క క్షణం.

"బాగున్నారా నాన్నా?"

అరుణరేఖ పలకరింపుతో తేరుకున్నా డాయన. "రామ్మా, రా. ఏమి టలా హఠాత్తుగా వచ్చేశావు?" ఆనందంగా పలకరించాడు. ఆమె చేతిలో సూట్‌కేసు అందుకుని లోపలికి తీసుకెళ్ళారు "ఏమేవ్! అరు ణొచ్చింది." వంటగదిలో ఉన్న సుభద్రమ్మ గారికి వినిపించేలా కేక వేశాడు.

"అరు ణొచ్చిందా?" తడి చెయ్యి పైట చెంగుకి తుడుచుకుంటూ గబగబ హాల్లో కొచ్చింది సుభద్రమ్మ.

"ఏమ్మా అరుణా! బాగున్నావా? ఇంతలా చిక్కిపోయావేమిటి?" తల నిమురుతూ ఆప్యాయంగా అడిగిం దావిడ.

ముభావంగా ఉన్న అరుణరేఖను చూసి ఏదో జరిగి ఉంటుందని ఊహించాడు జానకిరాం. "ఏమ్మా, ఏమైంది? అలా ఉన్నావేం? అల్లుడు గారు రాలేదేం?"

"ఆయన రాలేదు. ఇక రారు కూడా!" నెమ్మదిగా సమాధాన మిచ్చింది అరుణరేఖ.

"అల్లుడితో ఏమైనా గొడవ పడ్డావా?"

"అవు న్నాన్నా! ఆయనకి విడాకు లివ్వాలని నిర్ణయించుకుని వచ్చేశాను." సూటిగా చెప్పిం దామె.


వాళ్ళ గుండెల్లో పిడుగులు పడ్డాయి. చాలా రోజుల తరువాత కన్నకూతుర్ని చూసిన ఆనందం క్షణంలో ఆవి రయింది.

"ఏం జరిగింది అరుణా? మూడు ముళ్ళూ పడి మూడే ళ్ళయినా కాలేదు. విడాకులు తీసుకోవా లనుకుంటున్నావా?"

మనసులోని ఆవేదనను దాచుకోలేక జరిగిందంతా వివరించింది అరుణరేఖ. కొండంత బరువు దించుకున్న రిలీఫ్ కలిగిం దామెకు.

"భిన్న ధ్రువాల్లాంటి వ్యక్తిత్వాలు మా ఇద్దరివీ. మనసులు కలవని చోట అనుక్షణం బాధపడుతూ జీవించేకన్నా విడిపోవడమే మంచిదని నిర్ణయించుకున్నాను. నేను చేసింది తప్పా నాన్నా?"

"ఒప్పే అని ఎలా ఒప్పు కోమంటా వమ్మా? పరిస్థితుల్ని అర్థం చేసుకో లేని పసి పాప వేం కాదు. మగాడు ఏదో తిరిగాడని, మరేదో అన్నాడని అతనితో, సంబంధం తెంచుకోవడానికి అతను నీకు తాళి కట్టిన భర్త. కొన్ని కొన్ని విషయాలలో రాజీ పడక తప్పదు. ఇలా ప్రతి చిన్న విషయానికి రాద్ధాంతం చేసుకుంటే రచ్చ కెక్కేది మన బ్రతుకులే. అతనికేం? నువ్వు విడాకు లిస్తే మళ్ళీ పెళ్ళి చేసుకుంటాడు కానీ నువ్వు భవిష్యత్తునే నష్టపోతావు. ఒంటరి ఆడదానికి సమాజంలో గౌరవం లభించదు. అందరూ చిన్న చూపు చూస్తారు. సూటి పోటి మాటలతో బాధిస్తారు. ఈ కాకుల లోకంలో ఇటువంటి ఆటు పోట్లు నువ్వు తట్టుకోలే వమ్మా!




ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుంటూ నెమ్మదిగా అన్నా డాయన.

"చూడమ్మా అరుణ రేఖా! ఆవేశం అనర్ధ దాయకం. అన్ని వేళలా తొందర పడకూడదు. తొందరపాటు నిర్ణయాలు జీవితాల్నే బలి తీసుకుంటా యమ్మా! నీ వెనుక పెళ్ళి కావలసిన చెల్లె ళ్ళిద్ద రున్నారు. నేనింకా నాలుగేళ్ళలో రిటైరవు తాను. ఈ లోగా వాళ్ళిద్దరికీ పెళ్ళి చేసి సాగనంపాలని ఆరాట పడుతున్నాను. తండ్రిగా అది నా బాధ్యత. ఇప్పుడు నువ్విలా చేస్తే అది మన కుటుంబ భవిష్యత్తు మీద ఎటువంటి ప్రభావం చూపిస్తుందో ఆలోచించి నిర్ణయం తీసుకో తల్లీ! తెలివైన దానివి. పైగా చదువుకున్న దానివీను. అర్ధం చేసుకోవడానికి ప్రయత్నించు." భారంగా అన్నా డాయన. పెళ్ళి కెదిగిన ఇద్దరు కూతుళ్ళ బాధ్యత భుజాలపైన ఉంచుకున్న ఓ నగటు మనిషి నమాజానికి ఎదురీదాలనే ప్రయత్నాన్ని అంతకన్న హర్షించ లేడేమో!

ఆఫీసు కెళ్ళిపోయా డాయన.

'ఏం చేయాలి?' ప్రశ్నార్థకం మరోసారి కళ్ళముందు నిలిచింది. ఆలోచించ సాగింది అరుణరేఖ.

ఎలా తిరిగినా, ఏం చేసినా ఈ నమాజంలో మగవాడికి చెల్లుతుంది. తన బ్రతుకు తాను బ్రతికే అవకాశం ఆడదానికి మాత్రం లేదు. నలుగురూ వేలెత్తి చూపిస్తారు. కాకుల్లా పొడుస్తారు. తన చెల్లెళ్ళకు పెళ్ళి అవుతుందా? అందుకని భయపడి మళ్ళీ అతని దగ్గరి కెడితే అంతకన్న నరకం మరొకటుందా?

మధ్యాహ్నా మయ్యింది. అన్యమనస్కంగానే నాలుగు మెతుకులు తిని లేచిం దామె.

ఆమె ఆలోచనలు ఒకే చోట కేంద్రీకృత మయ్యాయ్. తన నిర్ణయం తన కుటుంబాన్ని బలి తీసుకోకూడదు!

మూడు గంట లవుతూండగా సూట్ కేస్ నర్దుకుని తల్లితో చెప్పింది అరుణరేఖ. "అమ్మా నేను బయలుదేరుతున్నాను".

ఆశ్చర్యపోయిం దావిడ - అల్లుడితో తెగ తెంపులు చేసుకుంటానని వచ్చిన కూతురు ఒక్క పూటలోనే ప్రయాణ మవ్వడం చూసి.

"అదేమిటే అప్పుడే ప్రయాణ మవుతున్నావు! రాక రాక వచ్చావు. రెండు రోజులుండి వెడుదూగానిలే."


"అలా కాదమ్మా, నే నిప్పుడే వెళ్ళాలి."

ఆత్రం అణచుకోలేక ఆవి డంది... "నాన్నగా రొచ్చాక చెప్పి వెడుదూగాని. ఈ లోగా చెల్లెళ్ళూ కాలేజీ నుంచొచ్చేస్తారు."

"వద్దు లేమ్మా, నే నిలా వచ్చి వెళ్ళినట్టు అందరికీ తెలియనక్కర్లేదు. వెళ్తా..."

"ఇంతకీ ఇంటికేనా వెళ్ళేది?" ఏదో అనుమానంతో అడిగా రావిడ.

ఆవిడ అనుమానం అర్థమయ్యింది అరుణరేఖకి. "అఘాయిత్యం చేసుకునే పిరికి దాన్ని మాత్రం కాను లేమ్మా! వెళ్ళగానే ఉత్తరం రాస్తాన్లే."




వెడుతున్న అరుణరేఖ వంక జాలిగా చూస్తు ఉండిపోయింది సుభద్రమ్మ.

నీరు నిండిన కళ్ళతో, బరువెక్కిన మనస్సుతో విశాఖపట్నం వెళ్ళే రైలెక్కింది అరుణరేఖ.

★ ★ ★

'స్త్రీ విమోచన సమితి' ఆఫీసులో డైరెక్టర్ శ్రీమతి ప్రభావతీ దేవితో మాట్లాడుతోంది అరుణరేఖ.

జరిగిన విషయమంత వివరించాక అంది "నాకు ఇంకెవ్వరూ లేరు. మీరే ఎలాగైన సహాయం చేయాలి."

"అలాగే నమ్మా. ఇంతకీ ఇప్పుడేం చేయ లనుకుంటున్నావ్?"

"మురళీధర్‌కి విడాకుల నోటీసు పంపిస్తాను. అతన్ని కోర్టులో నిలబెట్టి అతను చేసిన తప్పును అందరికీ తెలియజేస్తాను. మగాడి కుత్సిత బుద్ధిని నిలదీసి ప్రశ్నిస్తాను. నా గోడు అందరికీ తెలియాలి. అందుకే విడాకులు మంజూ రయ్యేవరకూ మా కేసుని పత్రికల కెక్కించండి. విపరీతంగా ప్రచారం చేయండి. ఆడవాళ్ళకే కాదు. మగ వాళ్ళకూ శీలం అవసరమే అని చాటి చెప్తాను. దాంపత్యం అనుకూలంగా సాగాలంటే పతివ్రత లయిన భార్యలతో బాటు సతీవ్రతు లయిన భర్తలదీ నమానమైన బాధ్యత ఉందని నమాజానికి తెలియ జేస్తాను."

"సతీవ్రతులా? అంటే...?"

"భర్తను దైవంగా పూజించే శీలవతి అయిన స్త్రీని పతివ్రత అంటారు. అలాగే భార్యను తప్ప వరాయి స్త్రీ నెరుగని శీలవంతుడైన భర్తని సతివ్రతుడు అనాలి కదా! ఈ పదాన్ని చరిత్రలో దాచిపెట్టి ఇన్నాళ్ళూ స్త్రీ జాతికి అన్యాయం చేశారు. నేటి పురుషాధిక్య నమాజానికి ఈ పదం ఎంతో అవసరం మేడమ్!"

"కాని ... తరువాత నీ పరిస్థితి...".

"నా ఒంటి మీది నగ లమ్మేస్తాను. కోర్టు ఖర్చులు పోనూ కొన్ని నెలల దాకా ఆ డబ్బు నరిపోతుంది. ఈ లోగా ఏదో ఒక ఉద్యోగం చూసుకుని నా బ్రతుకు నేను బ్రతుకుతాను. నా జీవితాన్ని నాకు నచ్చినట్టు తీర్చి దిద్దుకుంటాను. భయపడే వాళ్ళను మాత్రమే బాధ పెడుతుం దీ నమాజం. ఎదురు నిల్చిన వాళ్ళ నేమీ చేయలేదు. అందుకే ధైర్యంగా ముందడు గేస్తాను!"

"శభాష్ అరుణరేఖా! నీ ధైర్యం చూస్తుంటే నాకు చాలా ఆనందంగా ఉంది. నీకు ఉద్యోగం చూసే పూచీ నాది. శవాలు తిరుగుతున్న నేటి నమాజానికి నీవంటి వారి అవసరం ఎంతయినా ఉంది. స్త్రీ జాతిని మేల్కొల్పి వాళ్ళని చైతన్య వంతులు చేయడానికి నీలాటి ధైర్యవంతురాళ్ళే కావాలి. అందుకే నీకు కావలసిన సహాయమంతా 'స్త్రీ విమోచన సమితి' తరఫున తప్పక చేస్తాను. 'సతీవ్రతులు' ఒక ఉద్యమంగా మారాలి. ఇంటింటా వెలగాలి. ప్రతి మగాడూ ఆలోచించాలి. వాళ్ళలో మార్పు రావాలి." మనస్ఫూర్తిగా అన్నది ప్రభావతీదేవి.

చరిత్ర గతిని మార్చే ఓ నూతన అధ్యాయానికి ఆ క్షణమే అంకురార్పణ జరిగింది.

★